# ధర్మం, ఆత్మాభిమానాన్ని కాపాడేందుకు వీర్‌సాహెబ్ బలిదానం



## వీర్ బాల్ దివస్ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** భారత్ ధర్మాన్ని, ఆత్మాభిమానాన్ని కాపాడేందుకు గురు గోవింద్ సింగ్ ఆదేశానుసారం బలిదానాలు చేసుకున్నారని చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వీర్‌బాల్‌దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భారతీయ సాహసయోధులైన సాహిబ్‌జాదా జొరావర్ సింగ్, సాహిబ్‌జాదా ఫతే సింగ్‌లకు ఘన నివాళులర్పించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని ఆదేశాల మేరకు భారత ప్రభుత్వం మూడోసారి వీర్‌బాల్‌దివస్ పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. 2022లో తాను సాంస్కృతికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు మోడీ ఆదేశాల మేరకు తొలిసారిగా తాను వీర్‌బాల్‌దివస్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించానన్నారు. మూడోసారి ప్రతీ జిల్లాలు, పాఠశాలల్లో ఈ వీర్‌బాల్‌దివస్‌ను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలందాయన్నారు. ఈ దివస్‌ను పాఠ్య పుస్తకాల్లో సిలబస్‌లాగా పెట్టాలని డిమాండ్లు ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని తాము పరిగణనలోకి తీసుకున్నామన్నారు. తప్పకుండా సిలబస్‌లో వీర్‌బాల్‌దివస్‌ను పాఠ్యాంశాల్లో పెట్టడంపై స్వయంగా ప్రధాని మోడీతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. 350యేళ్ల క్రితం వీర్‌సాహెబ్ బలిదానం డిసెంబర్ 26రోజే జరిగిందన్నారు. బలిదానం చేసిన వారు కేవలం భారత బిడ్డలున్నారు. వీరి బలిదానాలను బిజెపి నమస్సులు చేస్తుందన్నారు. ఇలాంటి వీర పుత్రులను జన్మనిచ్చిన ఆ తల్లిదండ్రులకు కూడా శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. దేశం కోసం బలిదానాలు చేసిన ప్రతీ ఒక్కరికి నమస్కరిస్తున్నానన్నారు. ప్రస్తుతం ప్రతీ ఒక్కరూ వీరి బలిదానాల చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రానున్న సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని ప్రతీ గ్రామంలో నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. బలిదానాల దినోత్సవాన్ని కూడా పేరు మార్చాలనే డిమాండ్ ఉందన్నారు. దీనిపై కూడా చర్యలు చేపడతామన్నారు. వీర్ బాల్ దివస్ పేరు మార్పుపై కూడా ప్రధానమంత్రి మోడీకి వివరిస్తానన్నారు. పాఠ్యాంశాల్లో ఈ అంశం ఉండడం అత్యంత ఆవశ్యకమన్నారు. చరిత్రను బోధించాల్సిన అవసరం ఉందన్నారు. వీర్‌బాల్‌దివస్‌లో బలిదానాలను యువతకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. 28న రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వస్తున్నారని తెలిపారు. సిక్కు సోదరుల డిమాండ్ మేరకు సికింద్రాబాద్ నుంచి గోల్డెన్ టెంపుల్ వరకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేయాలనే డిమాండ్‌పై అందరం కలిసి మంత్రితో చర్చిద్దామన్నారు. ఈ విషయంలో తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బల్‌దేవ్ సింగ్, బగ్గాసింగ్, గురుదేవ్ సింగ్, బగేందర్‌సింగ్, హరిసింగ్, చంద్రశేఖర్, రాంచందర్, గౌతమ్‌రావు, ప్రేమేందర్, డా.శిల్పారెడ్డి, జయశ్రీ, హర్విందర్, మధుసూదన్, కొండేటి పాల్గొన్నారు.

# నారి అయిలయ్య మాటలు పార్టీ వైఖరి కాదు

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో మూసీ పునరుజ్జీవన సంకల్ప యాత్ర బహిరంగసభలో నల్లగొండ జిల్లా సీపీఐ(ఎం) సెక్రటేరియట్ సభ్యుడు నారి అయిలయ్య మాట్లాడిన మాటలు పార్టీ వైఖరి కాదని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవ సంకల్పయాత్ర బహిరంగ సభలో పాల్గొని, మూసీ సుందరీకరణ సమస్యపై నారి అయిలయ్య మాట్లాడుతూ తాను సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తరపున ప్రభుత్వ వైఖరిని సమర్థిస్తున్నానని చెప్పారు. అయితే అయిలయ్య చెప్పిన వైఖరి పార్టీ వైఖరి కాదని.. ఆయనను రాష్ట్ర కమిటీ ప్రతినిధిగా పార్టీ పంపలేదని తమ్మినేని తెలిపారు. రాష్ట్ర పార్టీ తరపున అని ఆయన మాట్లాడడం పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు, ప్రజలు ఈ విషయం అర్థం చేసుకోవాలని.. అయిలయ్య మాటలు పార్టీకి ఎటువంటి సంబంధం లేదని తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు.



తెలుగుభాషా కోర్సుల ఒప్పందపత్రంతో నిత్యానందరావు, హనుమంతరావు, వెంకటప్రతాప్ తదితరులు

# మలేసియాలో తెలుగు విశ్వవిద్యాలయం కోర్సులు

## విసి ఆచార్య వెలుదండ నిత్యానందరావు

**హైదరాబాద్ (నాంపల్లి), డిసెంబరు 26, ప్రభాతవార్త :** తెలుగుభాషలో నాలుగేళ్ళ డిప్లమా కోర్సును నిర్వహించడానికి మలేషియా తెలుగు సంఘం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంతో విద్యాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈమేరకు మలేషియాలోని రవాంగ్ పట్టణంలో గురువారం జరిగిన సమావేశంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, మలేషియా తెలుగు సంఘం అధ్యక్షుడు డా. వెంకటప్రతాప్, ఉపాధ్యక్షులు సత్తయ్య సుధాకర్ నాయుడు, సురేష్‌నాయుడులు, గౌరవ సలహాదారుడు డాక్టర్ అచ్చయ్యకుమార్ సమక్షంలో ఒప్పందం జరిగింది.

ఈ సందర్భంగా నిత్యానందరావు మాట్లాడుతూ తమ మూలాలను గుర్తుంచుకుంటూ తెలుగుభాష మరుగనపడిపోతే తెలుగుజాతి అస్తిత్వం పోయినట్లేనన్న ఆవేదనతో మలేషియాలో స్థిరపడ్డ తెలుగు భాషాభిమానులు మదిని సోమనాయుడు, డి.వి.శ్రీరాములు, అప్పలనాయుడుల 50ఏళ్ల కృషి మలేషియాలో తెలుగు కోర్సుల ప్రారంభానికి శ్రీకారమని హర్షాభావాన్ని వ్యక్తపరిచారు. తెలుగు విశ్వవిద్యాలయం ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సుతోపాటు నాలుగేళ్ళ డిప్లొమా కోర్సును ప్రారంభిస్తున్నట్లు, కేవలం తెలుగుభాష కోర్సులనే కాకుండా లలితకళారంగానికి చెందిన వివిధ సాంస్కృతిక కోర్సులనూ భవిష్యత్తులో తెలుగు మలేషియా సంఘం ద్వారా నిర్వహించడానికి సుముఖంగా ఉందన్నారు.

తెలుగుభాషా కోర్సుల కాలపరిమితి ఒక సంవత్సరం సర్టిఫికెట్ కోర్సుతోపాటు ఏకంగా నాలుగేళ్ల డిప్లొమా కోర్సును నిర్వహించడానికి ఒప్పందం చేసుకోవడం విశేషమని, ఇది మలేషియాలోని తెలుగు వలసదారులకు ఎంతో ప్రయోజనదాయకమని సంఘం అధ్యక్షుడు డా. వెంకటప్రతాప్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు మాట్లాడుతూ తెలుగుభాషలో సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమా కోర్సుల నిర్వహణలో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణతోపాటు సిలబస్, పరీక్షల నిర్వహణ బాధ్యతలను తెలుగు విశ్వవిద్యాలయం తీసుకుంటుందని తెలిపారు.

# సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెపై సిఎం స్పందించాలి

## ఉద్యోగులను ప్రభుత్వం చర్చలకు పిలవాలి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జాజుల లేఖ

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న సమగ్రసర్వశిక్ష ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. వారి న్యాయమైన డిమాండ్‌ల సాధన కోసం గత 19 రోజులుగా సమ్మె చేస్తున్నారని, సమ్మెలో భాగంగా 33 జిల్లాల కలెక్టరేట్‌ల కార్యాలయాల ముందు దీక్షలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వారిని చర్చలకు అహ్వానించి వారి డిమాండ్లు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డికి గురువారం శ్రీనివాస్ గౌడ్ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర శిక్ష అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తానని గత ఎన్నికల సందర్భంగా వాగ్దానం చేసి.. ఇప్పుడు చేయకుండా మాట మార్చొద్దని, వారిని రెగ్యులరైజ్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

విద్యాశాఖలోని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులుగా రాష్ట్రవ్యాప్తంగా 19300 మంది .. గత 20 సంవత్సరాలుగా విద్యాశాఖలో పనిచేస్తూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తూన్నారని, అలాంటి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. వారికి సమాన పనికి సమానం వేతనం ఇవ్వకుండా .. చాలీచాలని జీతాలిస్తూ వారితో వెట్టి చేయుంచుకుంటు న్నారని మానవతా దృక్పథంతో ప్రభుత్వం స్పందించాలని శ్రీనివాస్ గౌడ్ లేఖలో విజ్ఞప్తి చేశారు. 19 రోజులుగా ఉద్యోగులు, సిబ్బంది సమ్మె చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సమ్మె చేస్తున్న వారంతా బడుగు బలహీనవర్గాల ఉద్యోగులేనని, వారికి అండగా బహుజన సమాజం ఉంటుందని జాజుల శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. వెంటనే ప్రభుత్వం వారికి చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# విద్యుత్ సరఫరా సమస్యల పరిష్కారానికి అత్యవసర బృందాలు

## కరీంనగర్, హుజూరాబాద్ డివిజన్లకు మూడు టీమ్స్

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** విద్యుత్ సరఫరాలో సమస్యల పరిష్కారానికి దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్‌టీ) బృందాలను ప్రవేశపెట్టాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఈ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ బృందాల వ్యవస్థను అందుబాటులోకి తెలిచ్చింది. తాజాగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కూడా ఈ విధానాన్ని అమలుకు నడుంకట్టింది. ఇందులో భాగంగా కరీంనగర్‌కు రెండు, హుజూరాబాద్ డివిజన్‌లకు ఒకటి కలిపి మూడు ఈఆర్‌టీ బృందాలను కేటాయించారు. ఒక్కో బృందానికి ఒక వాహనాన్ని కేటాయిం చారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలి పోవడం, విద్యుత్ బిల్లుల్లో తేడాలు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మరియు కొత్త విద్యుత్ లైన్ల కోసం అభ్యర్థనలపై వినియోగదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించడానికి ఇప్పటికే టోల్ ఫ్రీ నంబర్ 1912ను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ఫిర్యాదు ప్రధాన అధికారి ద్వారా సెక్షన్ కార్యాలయానికి, క్షేత్రస్థాయి సిబ్బందికి ఫిర్యాదు చేయాల్సి రావడంతో సమస్య పరిష్కారానికి చాలా సమయం పడుతోంది. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేసేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది మళ్లీ ఉన్నతాధికారులపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో సమస్య పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ఈ అడ్డంకులన్నింటినీ నివారించడం ద్వారా సమస్యను తక్షణమే పరిష్కరించడానికి, ఎలక్ట్రిక్ డిపార్ట్‌మెంట్ అధికారులు నిళిగి బృందాలను ప్రారంభించారు, ఇందులో ఒక లైన్‌మ్యాన్ మరియు ఇద్దరు జూనియర్ లైన్‌మెన్ లేదా ఒక జూనియర్ లైన్‌మ్యాన్, ఒక ఎఎల్ఎమ్ మరియు లైన్‌మ్యాన్ ఉన్నారు. వేసవి కాలంలో లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లలో అనేక సమస్యలు తలెత్తుతాయి కాబట్టి, ఈఆర్‌టీ టీమ్‌ల ఏర్పాటు విద్యుత్ శాఖకు సహాయం చేస్తుందని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు వెల్లడించారు.

# నకిలీ మిర్చి విత్తనాలపై సమగ్ర నివేదిక ఇవ్వండి

## వ్యవసాయ శాఖకు వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ లేఖ

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నకిలీ మిర్చి విత్తనా లతో పలువురు రైతులు నష్టపోయారు. ఈ నేపథ్యంలో దీనిపై రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ దృష్టిసారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం కేలోత్ తండాలో మిర్చి సాగు చేసిన రైతులు నష్టపోయారు. దీనిపై స్పందించిన వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం కోదండరెడ్డి వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపికి లేఖ రాశారు. తండాలో మిర్చి సాగు చేసిన రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోయిన సంఘటనపై సంబంధిత అధికారులతో క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపించాలని ఆదేశించారు. అంతేకాకుండా దీనిపై సమగ్ర నివేదికను సైతం సమర్పించాలన్నారు. కేలోత్ తండాకు చెందిన నలుగురు గిరిజన రైతులు కొంత భూమిని కౌలుకు తీసుకున్నారని, స్థానిక సాయికృష్ణ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో విత్తనాలు కొని మిర్చి పంట సాగు చేసినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. పెట్టుబడి పెట్టి, శ్రమించి మిర్చి తోటలను పెంచితే చివరకు కల్తీ విత్తనాలుగా తేలి రైతులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా మరో సంఘటనలో ఖమ్మం జిల్లా తల్లాడ మండలానికి చెందిన రైతులు సుమారు 20 ఎకరాల్లో సారా జి20 రకం మిర్చి విత్తనాలను కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ పట్టణంలోని ఒక ట్రేడర్ వద్ద కొనుగోలు చేశారు. అయితే 6 నెలలు గడచినా నేటి వరకూ ఎదుగుదల లేకుండా పోయాయని అంటున్నారు. పైగా మొక్క అడుగు మేర పెరిగి కాయలు నేలకు తాకి పాచిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి 1.70 లక్షల రూపాయల మేర పెట్టుబడి పెట్టినామని చెబుతున్నారు. డీలర్ మోసంతో అదంతా నష్టపోయినట్లు కన్నీటి పర్యాంతమవుతున్నారు. ఎకరానికి 3 క్వింటాళ్లు కూడా దిగుబడి రాదని వాపోతున్నారు.

# వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



రాయికోడ్‌లో పర్యటిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్, చిత్రంలో ఎంపి డికె అరుణ

## 2018లో 112 జిల్లాలను ఆస్ప్రేషన్ డిస్ట్రిక్స్‌గా గుర్తింపు

## కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

## రాయికోడ్‌లో ఎంపి డికె అరుణ, ఎమ్మెల్యే శ్రీహరితో కలిసి పర్యటన

## కేంద్రం పథకాల అమలు తీరు సమస్యలపై ఆరా

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 26, ప్రభాతవార్త:** వెనుకబడిన జిల్లాల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోం సహాయక శాఖ మంత్రి బండి సంజయ్ అన్నారు. నారాయణపేట జిల్లా నర్వా మండలం రాయికోడు గ్రామంలోని పిహెచ్‌సి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఎంపీ డీకే.అరుణ, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి ఆయన పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, అమలు తీరు, సమస్యలపై ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు పౌష్టికాహారం అంద జేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాటాడుతూ 2018లో దేశంలో మొత్తం 112 జిల్లాలను ఆస్ప్రేషన్ డిస్ట్రిక్స్ గా గుర్తించారని, ఆ జిల్లాలో కేంద్ర మంత్రులు పర్యటించడం, పథకాల అమలులో మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఈ ప్రక్రియను మరింత పటిష్టం చేసేందుకు ఇంకా క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.

నీతి అయోగ్ ద్వారా క్షేత్ర స్థాయిలో పరిశీలన కార్యక్రమం జరుగుతోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 3 జిల్లాలను మరో 10 మండలాలను (అస్ప్రేషన్ బ్లాకులు) వెనుక బడిన ప్రాంతాలుగా కేంద్రం గుర్తించిందన్నారు. అందులో భాగంగానే ఇవాళ నారాయణపేట జిల్లా రాయికోడ్ లో అంగన్వాడీ, ప్రైమరీ స్కూల్, ప్రైమరీ హెల్త్ సబ్ సెంటర్లను సందర్శించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధు లతో క్షేత్ర స్థాయిలో అమలవుతున్న ప్రజా సేవలు, ఇబ్బందులు తెలుసుకుంటామని, క్షేత్రస్థాయి వరకు కేంద్ర ప్రభుత్వ పథకాల ఫలాలు చేరాలన్నదే లక్ష్యమన్నారు.

తెలంగాణలో అస్పిరేషన్ డిస్ట్రిక్స్ లో క్షేత్రస్థాయి పరిశీలన బాధ్యత తనకు అప్పగించారని వెల్లడించారు. భూపాలపల్లి, ములుగు జిల్లాలలో పర్యటించి అక్కడి పరిస్థితులు తెలుసుకోవడం జరిగిందని, నేడు కర్నాటకలోని యాదగిరి, రేపు రాయచూర్, గద్వాలలోని గట్టులో పర్యటిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం నిధులు దుర్వినియోగం కాకుండా క్షేత్ర స్థాయిలో ప్రజలకు, లబ్దికారులకు ప్రతి రూపాయి చేర్చడం కోసమే ఈ పరిశీలన చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రొఫెసర్ కంచె ఐలయ్య డిమాండ్

# గద్దర్ జయంతి నాటికి ఫిలిం అవార్డులను ప్రకటించాలి

**హైదరాబాద్, డిసెంబరు 26,ప్రభాతవార్త:** నంది అవార్డు గద్దర్ అవార్డుగా మార్చిన తర్వాత సినిమా ఇండస్ట్రీ సైలెంట్ గా ఉందని ఇప్పటి వరకు గద్దర్ అవార్డ్ ప్రక్రియకు ఫిలిం ఇండస్ట్రీ నిర్ణయాలు తీసుకోలేదని సెలక్షన్ కమిటీ కమిటీ వేయలేదని కావున ప్రభుత్వం చొరవ తీసుకుని జనవరి 31 న గద్దర్ జయంతి నాటికి ఫిలిం అవార్డులు ప్రకటించి ఇవ్వాలని ప్రొఫెసర్ కంచె ఐలయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణా వచ్చాక నంది అవార్డులు ఇవ్వడం లేదని గొడవ పెట్టిన సినీపెద్దలు గద్దర్ పేరు పెట్టాక ఎందుకు మరిచారని ప్రశ్నించారు. గద్దర్ జయంతి రోజు కచ్చితంగా అవార్డులు ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. అలాగే దేవుడి పేర్లతో విశ్వవిద్యాలయాలు ఉన్నాయన్న అంశంపై తాను చేసిన వ్యాఖ్యలను కొందరు వక్రీకరించారని కంచె ఐలయ్య అన్నారు.

ఇటీవల తాను మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ సభకు హాజరైన క్రమంలో కోఠీలోని మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ పేరును పెట్టడంపై పలు చర్చలు జరిగాయని, ఆమె నిరక్షరాస్యులని కొందరు వాదించారని, అదే క్రమంలో తాను కొన్ని దేవతల పేర్లతో విశ్వవిద్యాలయాలు కూడా ఉన్నాయని, అక్కడ అత్యుత్తమ విద్య అందుతుందని చెప్పానని, దానిని వక్రీకరిస్తూ ఆ విశ్వవిద్యాలయాలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారంటూ తనపై పలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారని, దానిని ఖండిస్తున్నానని తెలిపారు. విశ్వ విద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ, సినిమా అవార్డులకు గద్దర్ నామకరణం, వరంగల్లో త్వరలో ఏర్పాటు చేసే ఎయిర్‌పోర్టుకు దొడ్డి కొమురయ్య పేర్లను పెట్టడానికి తీసుకున్న నిర్ణయాలు సాంస్కృతిక విప్లవానికి నాంది అని అన్నారు.

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. త్వరలోనే తమ సొసైటీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయానికి ఆరు అడుగుల వీరనారి ఐలమ్మ విగ్రహాన్ని బహుకరించనున్నట్లు తెలిపారు.

# మిస్టరీ వీడని ఎస్ఐ, కానిస్టేబుల్, ఆపరేటర్ల ఆత్మహత్యలు

## ముగ్గురి మృతదేహాలు పోస్టుమార్టానికి తరలింపు

**భిక్కనూరు, డిసెంబరు 26, ప్రభాతవార్త :** కామారెడ్డి జిల్లా అడ్లూరు ఎల్లారెడ్డి చెరువులో ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, ఆపరేటర్‌లు ఆత్మహత్య చేసుకున్న ఘటన మిస్టరీ వీడకపోవడంతో పోలీసులకు సవాల్‌గా మారింది. గురువారం ఉదయం భిక్కనూరు పోలీసు స్టేసన్ ఎస్ఐ సాయికుమార్ మృతదేహాన్ని వెలికితీసారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో బీబీపేట మహిళా కానిస్టేబుల్ శృతి, సింగిల్ విండో సొసైటీలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న నిఖిల్ మృతదేహాలను వెలికితీసిన విషయం తెలిసిందే. శృతి బుధవారం సాయంత్రం తన సోదరుడికి ఫోన్ చేసి బందోబస్తు విషయంలో తనకు చాలా ఇబ్బందిగా ఉందని కన్నీళ్లు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఆమె రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో సెల్‌ఫోన్ సిగ్నల్స్ ట్రాక్ చేసి చెరువు వద్ద ఉన్నట్లు గుర్తించారు. అక్కడే ఎస్ఐ కారు కూడా ఉండటంతో గాలించి ముగ్గురి మృతదేహాలను వెలికితీసారు. ఎస్పీ సింధూశర్మ ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. పోస్టుమార్టు నివేదిక వస్తేనే గాని పూర్తి వివరాలు చెప్పలేమని ఆమె అన్నారు. సిసి పుటేజీలను పరిశీలించడం ద్వారా మరికొంత సమాచారాన్ని రాబట్టే ప్రయత్నం చేస్తున్నట్లు ఆమె చెప్పారు కాగా ఎస్ఐ సాయికుమార్, శృతి ఒకే కారులో అక్కడికి వచ్చినట్లు కొన్ని ఆధారాలు లభించాయి. నిఖిల్ విడిగా వచ్చినట్లు తెలుస్తోంది. శృతి, నిఖిల్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఇవి ఆత్మహత్యలు కావని హత్యలని ఆరోపిస్తున్నారు. కాగా భిక్కనూరు చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ సాయికుమార్ తన కారులో వెళుతున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి.

వీటిని పోలీసులు సేకరించారు, ఈ మార్గంలో ఉన్న మరికొన్ని సిసి కెమెరాల నుంచి దృశ్యాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వివేహేతర సంబంధాల వల్లే ఈ ఘటన జరిగిందన్న ఆరోపణల వస్తున్నాయి. ప్రస్తుతం భివక్కనూరులో పనిచేస్తున్న ఎస్ఐ సాయికుమార్ రెండేళ్ల క్రితం బీబీపేటలో పనిచేసే సమయంలో అక్కడే కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శృతితో పరిచయం ఏర్పడింది. అప్పట్లో వీరు సన్నిహితంగా మెలిగేవారని తెలుస్తోంది. శృతికి అప్పటికే వివాహం కాగా కుటుంబ తగాదాలతో ఆమె విడాకులు తీసుకుని ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఇటీవల కాలంలో బీబీపేట సింగిల్ విండో సొసైటీలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న నిఖిల్‌తో పరిచయం ఏర్పడిందని తెలుస్తోంది. కాగా బీబీపేటలో ఎస్ఐగా పనిచేస్తున్న సమయంలో సాయికుమార్‌ను పెళ్లి చేసుకోవాలని శృతి వత్తిడి చేసినట్లు తెలుస్తోంది. ఆ తరువాత ఎస్ఐ బదిలీ కావడంతో వీరిద్దరి మధ్య దూరం పెరిగింది. అప్పటి నుంచి వారి మధ్య అంతగా సంబంధాలు లేవని సన్నిహితులు చెబుతున్నారు. తాడ్వాయికి చెందిన శృతి బీబీపేటలో ఒంటరిగా ఉంటోంది. అయితే ఆమె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని సోదరుడు పేర్కొంటున్నారు. విధినిర్వహణలో ఇబ్బందులు ఉంటే ఆమె ఉండే గదిలోనే ఆత్మహత్య చేసుకునేదని, చెరువు వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలుస్తోంది. అయితే వీరు మృతి చెందడానికి ముందు ఎస్ఐ సాయికుమార్ నుంచి శృతికి ఫోన్ కాల్ వచ్చినట్లు రికార్డు అయ్యింది. ఆ సమయంలో వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ ఏమిటన్న అంశంపై పోలీసులు దృష్టి సారించారు. ఎస్ఐ, మహిళా కానిస్టేబల్, ఆపరేటర్‌లు రాత్రి సమయంలో చెరువు వద్దకు ఎందుకు వెళ్లారన్నది కూడా ప్రస్తుతం అనుమానస్పదంగా ఉంది. ఇద్దరిని హత్య చేసి మరొకరు ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే పోస్టుమార్టం రిపోర్టు వస్తేనేగాని పూర్తి వివరాలు బయటకు రావని పోలీసులు చెబుతున్నారు. వీరి ముగ్గురి మధ్య ఉన్న సంబంధాలపై పోలీసులు దృష్టి సారించారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మంద కృష్ణ మాదిగ

# ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కుట్రలను అడ్డుకుంటాం

## 'వెయ్యి గొంతులు-లక్ష డబ్బులు'తో సమాధానం : మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్ (అల్వాల్), డిసెంబరు 26, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ అమలును అడ్డుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను మరో ఉద్యమ పంథా ద్వారా అడ్డుకుంటామని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం అల్వాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాదిగ కళా మండలి జాతీయ అధ్యక్షుడు అశోక్ మాదిగ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మంద క్రిష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలును కొంత మంది మాల సోదరులు అడ్డుకోవడానికి శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తుండడం పట్ల ఆయన అవేదన వ్యక్తం చేశారు. మూడు దశాబ్ధాలుగా అలుపెరగని పోరాటం ద్వారా సాధించుకున్న హక్కులను వ్యతిరేకించడం అన్యాయమని తెలిపారు. దేశ అత్యున్నత స్థానం ఇచ్చిన తీర్పును గౌరవించక పోవడం ద్వారా అంబేద్కర్‌ను అగౌరవపరచడమే అన్ని స్పష్టం చేశారు. వర్గీకరణ అమలును ఆయా రాష్ట్రాలకు ఉందని చారిత్రాత్మకమైన తీర్పును ఇచ్చిందన్నారు. మాల సామాజిక వర్గంలోని కొంత మంది స్వార్థపరులు కుట్రలకు తెరలేపారన్నారు.ఎస్సీ వర్గీకరణ ద్వారా ఏ సామాజిక వర్గం నష్ట పోదని తెలిపారు. వర్గీకరణ వ్యతిరేక కుట్రలను ఎదుర్కొనడానికి మాదిక కళా నేతలుతో వెయ్యి గొంతులు లక్ష డప్పులు కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నామని పేర్కొన్నారు. జాతి విముక్తి కోసం మోగిన డబ్బులు జాతి విముక్తి కోసం మోగుతాయని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి మాదిగలు డప్పులను సంకను వేసుకుని లక్షలాదిగా కార్యక్రమానికి తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజా యుద్ధ నౌక ఏపూరి సోమన్న, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ, మచ్చ దేవేందర్ మాదిగ, ఎంఎస్‌పి రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి, ఎంఎస్‌ఎఫ్ జాతయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ళ శివ మాదిగ, రాష్ట్ర మహిళా నాయకురాలు జెపి లత మాదిగ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యా శాఖ పదోన్నతులన్నీ ప్రభుత్వ మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులకే ఇవ్వాలి

## గవర్నమెంట్ టీచర్స్ జెఎసి తీర్మానం

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యాశాఖలో పదోన్నతులన్నింటినీ ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లోని ఉపాధ్యాయులకే ఇవ్వాలని గవర్నమెంట్ టీచర్స్ జేఏసీ(జీటీ జేఏసీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు జీటీ జేఏసీ తీర్మానం చేసిందని జేఏసీ ఛైర్మన్ మామిడోజు వీరాచారి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్, గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ సంఘాలు కలిసి గవర్నమెంట్ టీచర్స్ జేఏసీ(జీటీ జేఏసీ)గా ఏర్పడడం జరిగింది. జేఏసీ ఛైర్మన్‌గా మామిడోజు వీరాచారి, కో ఛైర్మన్‌గా బైండ్ల నరసింహ, యం నళిని.. కన్వీనర్‌గా డి గిరి వర్ధన్, కో కన్వీనర్‌గా కర్ణకోట శ్రీనివాస్ గౌడ్, సెక్రటరీ జనరల్‌గా మేకల లక్ష్మీకాంత రెడ్డి ఎన్నిక కాగా.. మహిళా కార్యదర్శిగా కోట సుకన్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు వీరాచారి తెలిపారు.

ఈ సందర్భంగా గవర్నమెంట్ టీచర్స్ జేఏసీ(జీటీ జేఏసీ) తీర్మానించిన ముఖ్య డిమాండ్లను మీడియాతకు తెలిపారు. ప్రభుత్వ మేనేజ్మెంట్‌లోని ఉపాధ్యాయులకే విద్యా శాఖలోని అన్ని పదోన్నతులు కల్పించాలని.. ఉమ్మడి సర్వీస్ నిబంధనలను సుప్రీంకోర్టు, హైకోర్టు కొట్టేసినందున.. ప్రభుత్వ స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్స్, డైట్ లెక్చరర్స్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్(డిప్యూటీ డీఈవో), మండల విద్యాశాఖ అధికారి(ఎంఈవో) పదోన్నతులు కల్పించాలన్నారు.

గతంలో దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం.. జిల్లా పరిషత్ ఉపాధ్యాయులందరినీ జిల్లా పరిషత్‌లకు అప్పజెప్పాలని.. దాంతోపాటు పంచాయతీరాజ్ ఆక్ట్‌ను తూచ తప్పకుండా అమలు చేయాలని తీర్మానం చేసినట్టు తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో ఒక ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని.. ప్రతి జిల్లాకు ఒక డైట్ కాలేజీని ఏర్పాటు చేస్తూ.. ప్రభుత్వ స్కూల్ అసిస్టెంట్లకు డైట్ లెక్చరర్ పదోన్నతులు కల్పించాలన్నారు.

రెగ్యులరైజ్ అయినా కాంట్రాక్టు జూనియర్ మరియు డిగ్రీ లెక్చర్ల స్థానంలో అర్హులైన ప్రభుత్వ స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించాలని.. పెండింగ్‌లో ఉన్న డిఏలను మంజూరు చేసి.. నూతన పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలనీ.. దాంతోపాటు పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే చెల్లించాలని జీటీ జేఏసీ తీర్మానం చేసినట్టు వీరాచారి తెలిపారు.

